దిగుబడి తగ్గిన మిర్చి


సూగూరు శివారులో సాగు చేసిన మిరప పంట

- పరిమితికి మించి పెట్టుబడులు
- ముఖం చాటేసిన వానలు, సాగునీరు అందించని కాల్వలు
- మండలంలో 1,500 ఎకరాల్లో సాగు

పెబ్బేరు రూరల్: వర్షాలు లేక, కాల్వ నీళ్లు రాకపోవడంతో ఆ ప్రభావం మిర్చి రైతులపై పడింది. సరైన సమయానికి పంటకు నీరు అందకపోవడంతో పంట దిగుబడి దారుణంగా పడిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాదితో పోల్చితే సగం దిగుబడి కూడా వచ్చేది కష్టమే అని మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో..

జనుంపల్లి, సూగూరు, కొత్తసూగూరు, పెంచికలపాడు, ముగమోనిదిన్నె, యాపర్ల గ్రామాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో మిర్చి సాగుచేశారు. పంట తెగుళ్ల బారిన పడకూడదనే ఉద్దేశ్యంతో పరిమితికి మించి పెట్టుబడులు పెట్టారు. కానీ పంట పూత దశకు వచ్చే సమయానికి సరైన నీరు అందకపోవడంతో మొక్కలు పెరగకపోవడంతో దాని ప్రభావం పూతపై పడింది. ఈ వానాకాలం వర్షాలు ముఖం చాటేయడంతో పాటు కాల్వకు సైతం సాగు నీరు విడుదల కాకపోవడంతో మొక్కలు అనుకున్న స్థాయిలో పెరగలేదు.

ఎకరాలకు రూ.80వేల పెట్టుబడి

ఎకరానికి రూ.80వేల నుంచి రూ.లక్ష దాక పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, కానీ ప్రస్తుతం దిగుబడి 10క్వింటాళ్లు కూడా వస్తుందో లేదో అని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి పెట్టుబడిని పెట్టిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం జనవరి వరకు జూరాల నుంచి నీళ్లు వచ్చాయని, కానీ ఈ ఏడాది అక్టోబరు నుంచే నీటి విడుదల తగ్గించారని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని, ఇంకొన్ని రైజులైనా సాగునీరు విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

దిగుబడి రాలేదు



పది ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఈ ఏడాది వర్షాలు లేక, కాల్వ నుంచి నీరు సరిగా రాకపోవడంతో పంట దిగుబడి సరిగా రావడం లేదు. పంటలకు తెగుళ్లు కూడా ఎక్కువయ్యాయి. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్లు వచ్చిన దిగుబడి, ఇప్పుడు కాస్తా 10 క్వింటాళ్లు కూడా వస్తుందో లేదో తెలియదు. చేసిన అప్పులు తీరే పరిస్థితి కనబడం లేదన్నారు.

– గునమోని బిచ్చన్న, రైతు, సూగూరు

నీరు వదలాలి



8 ఎకరాల్లో మిరప సాగు చేశా. దీనికోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టాను. కానీ దిగుబడి చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు సాగునీరు విడుదల చేసి మిరప రైతులను ఆదుకోవాలి. లేకుంటే రైతులకు అప్పులే మిగులుతాయి.

– మండగరి అంజనేయులు, సూగూరు

పంట మార్పిడి తప్పనిసరి

నల్ల రేగడి పొల్లాలో తెగుళ్ల సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈసారి తెగుళ్ల సోకి మిర్చి పంట దెబ్బతింది. రైతులు పంట మార్పిడి చేయక పోవడంతో పంట దిగుబడి తగ్గి, తెగుళ్ల తట్టుకునే శక్తి కూడ తగ్గుతుంది. ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చి అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రమౌళి, వ్యవసాయ అధికారి, పెబ్బేరు

జనగళం

ఉచితాలతో మభ్యపెట్టొద్దు



అన్ని రాజకీయ పార్టీలు కూడా తమ మేనిఫెస్టోలో ఉచితాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ పద్ధతి మారాలి. విద్య, వైద్యానికి సరైన కేటాయింపులు జరగట్లేదు. నిరుద్యోగ సమస్య తీర్చేందుకు రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలి.

– రఘుగౌడ్, పామిరెడ్డిపల్లి, పెద్దమందడి



భరోసా ఇచ్చే వారికే..

రాజకీయ పార్టీలు విడుదల చేసిన ఏ మేనిఫెస్టో కూడా యువతకు భరోసా ఇచ్చేదిగా లేదు. అప్పటికప్పుడు ఓట్లు దండుకోవాలనే ఆలోచనతో ఉచిత పథకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. యువత, తల్లిదండ్రులు ఓటు ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచించాలి. భవిష్యత్‌కు భరోసా ఇచ్చే వారికే ఓటు వేద్దాం.

– యుగంధర్, దొడగుంటపల్లి, పెద్దమందడి

యువతకు పెద్దపీట వేయాలి



ఓటుతోనే ప్రజల మనుగడ ఆధారపడి ఉంది. ప్రస్తుత సమాజంలో రాజకీయాలతో యువశక్తి నిర్వీర్యమవుతుంది. ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఏ ప్రభుత్వాలు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఓటుతోనే యువశక్తిని చాటాలనుకుంటున్నాం. యువతకు దిశానిర్దేశం చేసే పాలకులు కావాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్యను తగ్గించాలి. యువత భవిష్యత్‌కు పెద్దపీట వేసే నాయకులకే ఓటు వేస్తాను.

– సంగసమోని లక్ష్మణ్, కేతేపల్లి, పాన్‌గల్

కులవృత్తుల వారికి ప్రోత్సాహకం అందించాలి



కులవృత్తుల వారిని ప్రోత్సహించేలా ఏ ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికల సమయంలో ఏదో కంటి తుడుపు చర్యగా కుల, చేతి వృత్తుల వారికి ఆదుకుంటామని హామీలు ఇస్తారు తప్పితే తర్వాత ఆచరణకు నోచుకోవట్లేదు. కుల వృత్తుల వారికి కావల్సిన యంత్రాలు, పనిముట్లను ఉచితంగా అందిస్తామని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాలి.

– విజయ్‌కుమార్ ఆచారి, వెల్టూర్

అభివృద్ధి చేసే నాయకుడికే పట్టం


వెన్నంచర్లలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా మహిళలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే బీరం

సాక్షి, నెట్‌వర్క్: పేదలకు సంక్షేమ పథకాలు అందించిన బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి మూడోసారి పట్టం కట్టాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్లలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం గణనీయ ప్రగతి సాధించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వృద్ధులకు రూ.5వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, తెల్లకార్డు కలిగిన వారకందరికీ బీమా సౌకర్యం, రూ.400 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, డాక్టర్ కుర్వ విజయ్‌కుమార్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పవన్ కుమార్ శర్మ మాజీ సర్పంచ్, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ శర్మ, గణేష్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, వెంకటయ్య, బిటరి నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

చేరికలు

బీఆర్‌ఎస్ పార్టీతోనే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని 11, 8 వార్డులు, చుక్కాయిపల్లి, ఎన్మన్‌బెట్ల, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామాలకు చెందిన నాయకులు కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

ఇంటింటి ప్రచారాలు

బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన తల్లి బిచ్చమ్మ కొల్లాపూర్‌లోని పలు వార్డుల్లో, పాన్‌గల్ మండలంలోని రేమద్దుల, శాగాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, రాముయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, మౌనికయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం పట్టణంలోని ఓ ఇంటిలో చోరీ జరిగిందని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం పట్టణానికి చెందిన గొల్లచింతల నాగేంద్రమ్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 10న తాటిపాములకు వెళ్లింది. 11వ తేదీన ఉదయం ఇంటి తలుపులు తెరుచుకొని ఉండడంతో స్థానికులు చూసి ఫోనులో ఆమెకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని గుర్తించి, ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాను విరగొట్టారు. ఇంట్లో విలువైన వస్తువులు ఏవీ పోలేదన్నారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణం బిజ్నాగడ్డతండాకు చెందిన బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శనివారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమిస్తాం

మదనాపురం: ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని, మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో త్వరలో మాదిగ జాతికి మేలు జరగబోతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగ విశ్వరూప మహాసభకు మదనాపురం మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జగదీష్, కోటేష్, కుమార్, కురుమూర్తి, నరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు హైదారాబాద్‌లో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు ఎమార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో శనివారం శ్రీరంగాపురం, పెబ్బేరు మండలం నుంచి మహిళలు, యువకులు, నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజనగరం రాజేష్, గాడిమూడి మన్నెం, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు


రామకృష్ణేశ్వర ఆలయంలో చండీహోమం చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులు

సాక్షి, నెట్‌వర్క్: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొండారెడ్డి, కావలి భాస్కర్, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎస్ కృష్ణారెడ్డి, వాసుదేవారెడ్డి, జెడ్పీటీసీ పద్మ ఆధ్వర్యంలో శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టయ్య, పెద్దింటి వెంకటేష్, మలేష్‌గౌడ్, భగవంతు, చంద్రకల, చెన్న రాముడు, బాలయ్య ఉన్నారు.

చండీ హోమం

జిల్లా కేంద్రంలోని రాజనగరంలో గల రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, సతీమణి వాసంతితో కలిసి చండీహోమం చేశారు.

23 కిలోమీటర్ల రన్నింగ్

రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొలువుదీరాలని ఆకాంక్షిస్తూ పెబ్బేరుకు చెందిన ప్రకాష్ 23 కిలోమీటర్లు ఆగకుండా శనివారం పరుగులు తీశాడు. రాజనగరం శివారులోని రామకృష్ణేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిశారు. 2018 ఎన్నికల్లోనూ.. ఇదే మాదిరిగా పెబ్బేరు నుంచి వనపర్తి వరకు పరుగు తీసినట్లు మంత్రి గుర్తుచేశారు. పెబ్బేరు మండలంలో మంత్రికి మద్దతుగా మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీధర్, పెబ్బేరు మార్కెట్ చైర్మన్ బుచ్చారెడ్డి ఉన్నారు.

బొడ్రాయి పండుగను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న మంగమ్మ

అమరచింత: పట్టణంలో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించే బొడ్రాయి పండుగను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణంలో శనివారం బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాల నిర్వహణ గురించి సమీక్ష నిర్వహించారు. ఈమేరకు మాట్లాడుతూ 13న సాయంత్రం బొడ్రాయిని పట్టణ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 14న గణపతి పూజ జలాదివాసంతో కార్యక్రమాలు ప్రారంభవుతాయన్నారు. 15న యాగశాలలో హోమపూజ, మధ్యాహ్నం బొడ్రాళ్లను ఇంటి ఆడపడుచులు అందరితో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16న ఉదయం 9:15 నుంచి 10 గంటల మధ్య ఏకకాలంలో బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన జరుగుతుందని పేర్కొన్నారు. పవిత్రంగా నిర్వహించే ఉత్సవాల సందర్భంగా గ్రామంలో మూడు రోజుల పాటు మద్యం, మాంసం నిషేధిస్తున్నామని ఇందుకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగభూషణంగౌడ్ ఉన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం


బాలకిష్టాపూర్‌లో మాట్లాడుతున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

ఆత్మకూర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపడుతుందని మక్తల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, మేర్వరాజు, అశోక్‌జీ, రేచింతల శ్రీను, క్యామ భాస్కర్, నాగేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చిన్న నర్సింహ, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, యశ్వంత్ ఉన్నారు.

నర్వ: మండల కేంద్రంలోని శుక్రవారం వివిధ పార్టీలనుంచి కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు డ్రైవర్ బుచ్చన్న, కట్ట నర్సింహులుతోపాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు నరేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, అయ్యన్న, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధర సరే.. కొనుగోలు కేంద్రాలు ఏవీ?

- కల్లాల వద్దే దళారుల వ్యాపారం
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు
- ప్రైవేట్ వ్యాపారులు చెప్పిందే రేటు..


అమరచింత శివారులో కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

అమరచింత: వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి నేరుగా వరి ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ అధికారుల ప్రకటనలు కేవలం పత్రికలకే పరిమితమయ్యాయి. మండలంలో ఇప్పటికీ వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతుల పంట పొలాలకు వద్దకే వెళ్లి కల్లాల నుంచే వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న పరిస్థితులు దాపరించాయి. ప్రభుత్వం వరికి రూ.2,250 మద్దతు ధర ఇస్తున్నామని ప్రకటించారే తప్పా ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రం సైతం ఏర్పాటు చేయలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు పరిధితో పాటు అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టులో వరికోతలు ప్రారంభమయ్యాయి. దీంతో కల్లాల్లో వరిధాన్యం ఆరబెట్టుకోవడానికి వాతావరణం అనుకూలించకపోవడం, అకాల వర్షాల కారణంగా తక్కువ ధర వస్తున్న తమ వరిధాన్యం అమ్ముకోవాలనే తాపత్రయంతో తక్కువ ధరకే దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సన్నరకం వరికి రూ.2,100, దొడ్డు రకానికి రూ.1,850 చెల్లిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో వరికోతలు జోరందుకున్నాయన్న విషయాలను తెలుసుకున్న ప్రైవేట్ వ్యాపారులు వరి కొనుగోళ్లపై దృష్టి సారించి, సేకరించిన ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళారీ వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వ పరంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

క్రీడలతోనే మానసికోల్లాసం



వీపనగండ్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో దీపావళి, గంగమ్మ జాతరను పురస్కరించుకొని వీపీఎల్ 3 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గ్రామాల్లోని యువకులు క్రీడల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దీంతో పాటు విద్యలోనూ రాణించాలని ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు మల్లయ్య యాదవ్ అన్నారు. ప్రతి ఏడాది పలువురి దాతల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిబాబ, కుర్మయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తాం

అమరచింత: బీఆర్‌ఎస్‌తోనే ప్రజాసంక్షేమం కొనసాగుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్ ఇంటి ఆవరణంలో పట్టణానికి చెందిన పలువురు క్రికెట్ క్రీడాకారులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ నాయకుల హామీలను నమ్ముకుంటే మూడు గంటలే కరెంటు వస్తుందని, ఇదివరకే ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల పాటు కరెంట్ ఇస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాయత్రి, విజయభాస్కర్‌రెడ్డి, బంగారు శ్రీను, శ్రీధర్‌గౌడ్, శివరంజని, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కోటేష్ తదీతరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ చేసిన మంచి పనులను చూసి మరోసారి ఆశీర్వదించాలని దేవరకద్ర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మండలంలోని కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, ఈదులబాయితండా, మదనాపురం మండలంలోని గోవింద హళ్లి, దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల్లో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఎంపీపీ పద్మావతి, జయంతమ్మ, జక్కుల అనురాధ, సర్పంచ్‌లు శ్రీను, సుదర్శన్‌రెడ్డి, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, బాబురెడ్డి, నరోత్తం రెడ్డి, వైస్ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, హోటల్‌రాజు, గోవర్ధన్ నాయుడు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కట్టుబడి ఉన్నాం

పాన్‌గల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పించాలని కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మంగళ్లపల్లి, కిష్టాపూర్‌తండాల్లో నిర్వహించిన పరివర్తన్‌యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొల్లాపూర్ అభివృద్ధి, సమస్యల పరిష్కారం, పిల్లల భవిష్యత్తు కోసం బీజేపీకి అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, రవాణా, ఉపాధి రంగాలల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగోటంరామన్న, రోజారమణి, అన్వేష్, రమేష్, నాగరాజునాయుడు, శ్రీకాంత్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

కొత్తకోట: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి చెందడం ఖాయమని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కొత్తకోటలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నియంత పాలనకు అంతులేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందాడని ఆరోపించారురు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో పల్లమర్రి తిరుపతి రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనువాసులు, జితేంతర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాన్‌గల్: పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని అన్నారం, దొండాయిపల్లి గ్రామాల్లో గడప, గడపక కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హైమావతి, వెంకటేష్‌నాయుడు, రవికుమార్, విండో వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ సర్పంచ్ మహేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com